ప్రజాశక్తి
ఆదివారం 11 మే 2025
5
విజయనగరం

భారత్‌పై పాకిస్తాన్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన రాష్ట్రంలోని సత్యసాయి జిల్లాకు చెంతిన వీరజవాను మురళీనాయక్‌కు విజయనగరంలోని కొణిశ వీధిలో సామాజిక సేవలకు చంద్ర కళాధర్ ఆధ్వర్యాన 58 దీపాలతో అక్షరాకృతిలో నివాళులర్పించారు. తెలుగు వెలుగు సంస్థ సభ్యులు శోభారాణి, రమణాశంకర్ తదితరులు పాల్గొన్నారు.
– ప్రజాశక్తి, విజయనగరం

20న సమ్మెను జయప్రదం చేయండి

కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల వేదిక పిలుపు

అభివాదం చేస్తున్న కార్మిక, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థలు పరిరక్షణ కోసం, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు , స్వతంత్ర ఫెడరేషన్ల వేదిక నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మోడీప్రభుత్వం కార్మికవర్గంపై బహుముఖ దాడి చేస్తోందన్నారు. 95 శాతంగా ఉన్న కార్మికులకు తీవ్రమైన నష్టం చేకూర్చే విధంగా కార్మిక చట్టాలు, హక్కులపై దాడి చేస్తోందన్నారు. కార్మికులకు ప్రశ్నించే హక్కు లేకుండా , పని గంటలతో సంబంధం లేకుండా బానిసలుగా కార్మికులను చేసే పరిస్థితి నేడు మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. అనేక పథకాల్లో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ పథకాల్లో పని చేస్తున్న స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు లేవని, ఉద్యోగ భద్రత లేకుండా అభద్రతతో జీవిస్తున్నారని తెలిపారు. ప్రాణాలు అర్పించి 8 గంటలు పని దినం, సమ్మె హక్కు,కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కులు సాధించు కున్నామని, కానీ నేడు మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు అప్పగించే పాలన సాగుతుందన్నారు. 27 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా మార్చేసి కార్మికులను బానిసలుగా మార్చే ప్రక్రియ. మోడీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడాన్ని ప్రతిఘటించకోతే కార్మిక వర్గానికి మనుగడ ప్రమాదంలో పడుతతుం దన్నారు. ఇటువంటి నేపథ్యంలో పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను,సమ్మె చేసే హక్కును,కనీస వేతనాలు సాధన కోసం,ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు ఈనెల 20న జరుగుతున్నసమ్మెను జిల్లాలో అన్ని వర్గాలు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, ఐఎఫ్‌టియు రాష్ట్రఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరావు, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెహరా శంకరరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ఎపి మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర సంయుక్త ప్రధానకార్యదర్శి యు.ఎస్‌రవికుమార్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బి.గీత, ఎఐఎఫ్‌టియు నాయకులు ఎం.అప్పల రాజు, కార్మిక, ప్రజాసంఘాలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు ఇటీవల ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులు అర్పించింది.

పౌరుల రక్షణ కోసం

యంత్రాంగం సన్నద్ధం

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- సోషల్ మీడియాలో వచ్చే సందేశాలను చూసి ఆందోళనకు గురికావొద్దు
- జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ ఎస్. సేతు మాధవన్
- జిల్లా అధికారులతో ఆన్‌లైన్ సమావేశం

ప్రజాశక్తి–విజయనగరం

పాకిస్తాన్‌తో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొని జిల్లా జిల్లాలోని ప్రజలకు రక్షణ కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎస్ సేతుమాధవన్ జిల్లా అధికారులను ఆదేశించారు. కేంద్రహోం మంత్రిత్వ శాఖ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో పౌరుల రక్షణ చర్యల సన్నద్ధత కోసం చేపట్టాల్సిన చర్యలపై జిల్లా అధికారులకు ఆయన శనివారం నిర్వహించిన ఆన్లైన్ సమావేశంల ో దిశానిర్దేశం చేశారు. జిల్లా అధికారులంతా తమ పని ప్రదేశంలో అందుబాటులో ఉంటూ సన్నద్ధత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తమ శాఖల్లో సిబ్బందికి సెలవులను రద్దుచేసి అందరూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర సమయాలలో సమాచారం కోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని, ఇది 24 గంటలు పనిచేస్తుందని పేర్కొన్నారు. విపత్తుల యాజమాన్య సంస్థ జిల్లా మేనేజర్ రాజేశ్వరి కంట్రోల్ రూమ్ ఇన్చార్జిగా వ్యవహరిస్తారని చెప్పారు. 08922-236947, 8500838646 ఫోన్ నెంబర్లలో కంట్రోల్ రూమ్ అధికారులను సంప్రదించవచ్చని ఇన్చార్జి కలెక్టర్ తెలిపారు. 6300851185 మొబైల్ నెంబర్‌తో డి–సెక్షన్ సూపరిఇంటెండెంట్ రామకృష్ణను కూడా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అధికార అధికారికంగా ప్రకటించిన సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలనిప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్ సరఫరాకు సంబంధించి ఎలాంటి కొరత లేదని తెలిపారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు రేషన్ దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన జిల్లా స్థాయి కంటిన్జెన్సీ ప్రణాళికను సిద్ధం చేయాలని విపత్తుల యాజమాన్య సంస్థ జిల్లా మేనేజర్ ను ఆదేశించారు. జిల్లాలోని బస్ స్టేషన్లు రైల్వే స్టేషన్లు, ముఖ్యమైన దేవాలయాలు, ఇతర ప్రముఖమైన ప్రదేశాల్లో నిరంతరం తనిఖీలు చేపట్టాలని పోలీసు శాఖకు సూచించారు. ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నామని అదనపు ఎస్పీ సౌమ్యలత తెలిపారు. జిల్లాలో ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు రెండు ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు, రెండు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నట్టు ఆయా సంస్థల ప్రతినిధులు ఇంచార్జ్ కలెక్టర్ కు వివరించారు. జిల్లాలో అత్యవసర పరిస్థితుల సన్నద్ధత కోసం పౌర రక్షణ ఏ విధంగా చేపట్టాలనే అంశంపై అవగాహన కలిగించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్టు డిపిఎం రాజేశ్వరి వివరించారు. సమావేశంలో డిఆర్ఓ శ్రీనివాసమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

క్రీడా శిక్షణ శిబిరంలో కరాటే నేర్చుకుంటున్న చిన్నారులు

ఉత్సాహంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మొత్తం 16 క్రీడా అంశాల్లో శిక్షణ శిబిరాలు జిల్లాలో 50చోట్ల నడుస్తున్నాయి. నెల రోజుల పాటు జరిగే క్రీడా శిక్షణా శిబిరాలకు విద్యార్థులు అధికసంఖ్యలో హాజరవుతున్నారు. బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, కరాటే, తైక్వాండో, బాక్సింగ్, ఆర్చరీ, అథ్లెటిక్స్, హాకీ, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడలకు శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన శిక్షణ శిబిరాలకు రోజు రోజుకు వచ్చే విద్యార్థులు సంఖ్య పెరుగుతోంది. వందల సంఖ్యలో విద్యార్థులు హాజరవుతున్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు మెటీరియల్ కోసం రూ.7వేలు, శిక్షకుడికి రూ.2000 వేలు గౌరవ వేతనం కింద మంజూరు చేశారు. ఈ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో మానసిక, శారీరక ధారుడ్యం ఎంతగానో వృద్ధి చెందుతాయి. వీటితో పాటు నాణ్యమైన క్రీడాకారులు తయారు కావడానికి ఉపయోగ పడనున్నాయి. వేసవి శిక్షణ శిబిరాలకు మంచి స్పందన వస్తుందని,విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో హాజరవు తున్నారు అని డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు తెలిపారు. మెరుగైన, నాణ్యమైన క్రీడాకారులు తయారు కావడానికి శిబిరాలు తోడ్పడతాయని తెలిపారు.

అసాంఘిక శక్తుల అణచివేతే లక్ష్యంగా తనిఖీలు

ప్రజాశక్తి–విజయనగరంకోట

దేశ సరిహద్దుల్లో యుద్ధ మేఘాలు నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లాలోని ముఖ్య పట్టణాలైన విజయగరం, బొబ్బిలి, రాజాంలలో ఆకస్మికంగా 'స్టేటిక్ స్ట్రేంజర్ చెకింగ్' చేపట్టినట్లు ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. అందులో భాగంగా జిల్లాలోని ముఖ్య పట్టణాలైన విజయనగరం వన్ టౌన్, టూ టౌన్, బొబ్బిలి, రాజాం ఆకస్మికంగా 'స్టేటిక్ స్ట్రేంజర్ చెకింగ్స్' చేపట్టారు. ఈ తనిఖీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఒక ప్రాంతంలోకి ఆకస్మికంగా ప్రవేశించి, ఆయా ప్రదేశాల్లో గుమిగూడిన వ్యక్తుల లగేజ్‌లు, బ్యాగుల్లో మద్యం, గంజాయి, డ్రగ్స్, బాంబులు, ఇతర ప్రేలుడు వస్తువుల గురించి తనిఖీ చేసి, వారి వ్యక్తిగత గుర్తింపు కార్డులను పరిశీలించారు. కొన్ని తీవ్రవాద గ్రూపులకు చెందిన వ్యక్తులు దేశంలోకి ప్రవేసించి ప్రజలు ఎక్కువగా గుమిగూడి ఉండే ప్రాంతాలు, ప్రజా సముదాయాల్లో విధ్వంసాలు, విభిన్న మతాల మధ్య మత కల్లోలాలు సృష్టించే అవకాశం ఉన్నందున ఈ తనిఖీలు చేపట్టారు. విజయనగరం, బొబ్బిలి పట్టణాల్లోని పలు ప్రాంతాల్లో పోలీసు అధికారులు, స్పెషల్ పార్టీ పోలీసులు, తనిఖీలు చేపట్టారు. విజయనగరం డిఎస్‌పి శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు పర్యవేక్షించగా, సిఐలు ఎస్.శ్రీనివాస్, టి.శ్రీనివాస్, కె.సతీష్ కుమార్, హెచ్.ఉపేంద్రరావు, ఎస్ఐలు, పోలీసు, ఎస్‌టిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సువర్ణావకాశం

- ఎంఎస్ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్
- కొండకిండాం, కొట్టక్కిలో ఎంఎస్ఎంఇ పార్కులకు శంకుస్థాపన

రామభద్రపురం : కొట్టక్కి సభలో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి–బొండపల్లి, రామభద్రపురం

ప్రతీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఇ పార్కును ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరం నియోజకవర్గ పరిధిలోని బొండపల్లి మండలం కొండకిండాం గ్రామంలో సుమారు 57.49 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కుకు, రామభద్రపురం మండల పరిధిలోని కొట్టక్కి గ్రామం వద్ద రూ.7కోట్లతో మంజూరైన ఎంఎస్ఎంకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబినాయన అధ్యక్షతన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఇదొక సువర్ణావకాశమని పేర్కొన్నారు. పరిశ్రమకు అవసరమైన స్థలాన్ని అందించడంతోపాటు సబ్సిడీలు, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ అవకాశాలు, ఇతర రాయితీలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎంఎస్ఎంఇ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగానే ఉద్యోగాలు లభిస్తాయని, వలసలను అరికట్టవచ్చునని అభిప్రాయపడ్డారు. ఈ పార్కుల్లో 24 గంటల విద్యుత్, రోడ్ల సౌకర్యం, మంచినీటి సౌకర్యంతోపాటు ట్రైనింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఈ పార్కుల్లో ఉత్పత్తులు బయటకు తీసుకువెళ్లి రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ, అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు రాష్ట్రాభివృద్ధిలో కీలక పరిణామమని పేర్కొన్నారు. ఈ పార్కులో తొలిదశలో అభివద్ది చేయనున్న 25 ఎకరాల్లో సుమారు 180 ప్లాట్లు రూపొందిస్తామని, వీటి ద్వారా దాదాపు 90 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. వీటివల్ల ప్రత్యక్షంగా 1000 మందికి, పరోక్షంగా మరో 200 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు వీలైనంత వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా రామభద్రపురంలో కూరగాయల మార్కెట్ ఎంతో ప్రసిద్ధి చెందిందని, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసి దళారీ వ్యవస్థ లేకుండా రైతులకు మెరుగైన ధరలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ వచ్చే మూడేళ్లలో ఈ పార్కులన్నీ అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంల రాష్ట్ర ఎంఎస్ఎంఇ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ శివశంకరప్రసాద్, డిసిఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ ఎఎంసి ఛైర్మన్ పివివి గోపాలరాజు, కూటమి పార్టీల నాయకులు కొండపల్లి కొండలరావు, రెడ్డి పావని, ఎం.సురేష్, దుర్గాప్రసాద్, ఎం.పార్వతి మాట్లాడారు. ఎపిఐఐసి జెడ్ఎం మురళీమోహన్, ఆర్‌డిఓ డి.కీర్తి, తాహశీల్దార్ డి.రాజేశ్వర్రావు, ఎంపిడిఓ కె.తులసీనాధ్ తదితర అధికారులు, సర్పంచ్ ఆదిలక్ష్మి, శ్రీదేవి తదితర నాయకులు పాల్గొన్నారు. బొబ్బిలిలో కూటమి నాయకులు బాబు, గిరడ అప్పలస్వామి, మరిశర్ల రామారావు, మర్రాపు సురేష్, మడక తిరుపతిరావు, చింతల రామకృష్ణ, కర్రోతు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను ప్రయోగశాలలుగా మార్చొద్దు

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలలను ప్రయోగశాలలుగా మార్చవద్దని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు సదాశివరావు అన్నారు. ఎపిటిఎఫ్ 1938 జిల్లా కార్యనిర్వాహక సమితి సమావేశం శనివారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బి.బలరాం నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెంబర్ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం తో పాటు తెలుగు మీడియం కొనసాగించాలని, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ప్రాథమిక పాఠశాలలో 1: 20 ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాలల్లో 1:45 ఉండాలని,ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలన్నారు. సర్ ప్లస్ స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలకు కేటాయించడం శాస్త్రీయం కాదని అన్నారు. ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతులు కల్పించి ప్రాథమిక పాఠశాలల హెచ్ఎలుగా నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వి పైడ్రాజు, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ ఆర్.కృష్ణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.మధుసూదన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్‌విఎస్ఎన్ మూర్తి జిల్లా కార్యదర్శి వి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీతంలో 12న ఇ-గేమ్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి–విజయనగరం

స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో వర్డ్ ఎనలిస్ట్ ఆర్.యు నరసింహం రచించిన ఇగేమ్ (ఇంగ్లీష్ గ్రామర్ యాక్సిస్ మేడ్ ఈజీ) ఆంగ్ల వ్యాకరణ పుస్తకాన్ని ఈనెల 12న సత్య విద్యాసంస్థలు సెక్రటరీ మరియు కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి చేతుల మీదుగా, సెంచూరియన్ యూనివర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ జిఎస్ఎన్ రాజు, జెఎన్‌టియు గురజాడ రిజిస్ట్రార్ జయసుమ ఆవిష్కరించనున్నారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ఆంగ్ల భాషను నేర్చుకునే విద్యార్థులకు సులువైన పద్ధతిలో ఇంగ్లీష్ గ్రామర్ ను వివరించడం అభినందనీయమని అన్నారు.

నాటికలో ఓ సన్నివేశం

ఆకట్టుకుంటున్న నాటికలు

ప్రజాశక్తి–చీపురుపల్లి

గరివిడి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. గరివిడి పట్టణంలో గల శ్రీరామ్ హైస్కూల్లో జరుగుతున్న ఈ కార్యక్రమాలు రక్తి కట్టిస్తున్నాయి. రెండోరోజైన శనివారం ప్రముఖ సినీ నటులు నరసింహారాజు, జయలలిత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిగురు మేఘం, రైతే రాజు, అనూహ్యం నాటికల్లో కళాకారులు జీవించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న యధార్థ గాధలను కళ్లకు కట్టినట్లు రక్తికట్టించారు. నాటికల్లో నటించిన కళాకారులు ప్రేక్షకుల హర్షాధ్వానాలు అందుకున్నాయి.

జ్యోతిప్రజ్వలన చేసి రెండోరోజు నాటికలను ప్రారంభిస్తున్న జయలలిత

12న నేషనల్ తైక్వాండో సెమినార్

ప్రజాశక్తి–విజయనగరం

ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు రాజీవ్ స్టేడియంలో మూడవ నేషనల్ తైక్వాండో సెమినార్ జరుగుతుందని తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ ఈ సెమినార్‌కు ఇరాన్ దేశానికి చెందిన అబ్బాస్ షేక్ ట్రైనర్ గా విచ్చేస్తున్నారు. ఈ సెమినార్ 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఈ సెమినార్‌లో సౌత్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజలకు మెరుగైన సేవలందించండి

విస్తృత సమావేశంలో టిడిపి నాయకులు పిలుపు

ప్రజాశక్తి–బొబ్బిలి

ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ చేరేలా చేయడం, మరియు పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాయకులు కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు. టిడిపి జిల్లా విస్తృతస్థాయి సమావేశం శనివారం బొబ్బిలిలో జరిగింది. ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, బేబీ నాయన, జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జునతో పాటు జిల్లా టిడిపి నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో ముందుగా జమ్మూ కాశ్మీర్‌లో దేశరక్షణ కోసం ప్రాణాలు అర్పించి వీరమరణం పొందిన మన రాష్ట్రానికి చెందిన జవాన్ మురళినాయక్ చిత్రపటానికి నివాళి అర్పించారు, అనంతరం సమావేశంలో నాయకులు మాట్లాడుతూ టిడిపి సంస్థాగత నిర్మాణంలో భాగంగా జరిగే పార్టీ కమిటీల నియామకంలో సమన్వయంతో పనిచేయాలని, బూత్ ఇంచార్జ్, కో ఇన్‌ఛార్జి నియామకం, గ్రామ,డివిజన్ కమిటీల నియామకం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కోరారు. కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వం దరఖాస్తులు చేసుకొనే అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలన్నారు.

ఆదివాసీల్లో ఆగ్రహం

ప్రజాశక్తి– విజయనగరం ప్రతినిధి

ఓ వైపు డిఎస్‌సి సమయం దగ్గరపడుతోంది. మరోవైపు గిరిజనులకు మెగా డిఎస్‌సిపై ప్రభుత్వం నోరు మొదపడం లేదు. దీంతో, గిరిజన ఆదివాసీల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ప్రభుత్వం మాత్రం తనకు పట్టనట్టు వ్యవహరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు చేస్తున్న ఆందోళనలపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇటీవల పలు దఫాలు స్పందించిన విషయం విధితమే. తొలుత అమాయక గిరిజనులు వైసిపి మాటలు నమ్మి మోసపోవద్దంటూ ప్రకటన చేశారు. వాస్తవానికి గిరిజనులు వైసిపిని కూడా నమ్మలేదు. ఎందుకంటే వైసిపి కూడా ఇటువంటి హామీ ఇచ్చి మోసం చేసింది. బహుశా అందుకేనేమో వైసిపి ఆవిర్భావం నుంచి మంచి పట్టున పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల్లో ఆ పార్టీని మట్టికరిపించింది. అందులో భాగంగానే సాలూరు వాసులు సంధ్యారాణికి పట్టం కట్టారు. ఆమెకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవి కూడా వరించింది. అందువల్లే వైసిపిని నమ్మొద్దని గిరిజనులకు చెప్పడం వారిని దూరం చేసుకోవడం లేదా తప్పుదారి పట్టించడమేనని పబ్లిక్ టాక్ వినిపిస్తోంది. ఆ తరువాత కొద్ది రోజులకే ఆందోళనలు ఆపితే సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి గిరిజన మెగా డిఎస్సీ విషయమై త్వరలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చే విధంగా కృషిచేస్తానని చెప్పారు. తీరా నిన్నకాక మొన్న జరిగిన సమావేశంలో అటువంటి చర్చయేమీ వినిపించలేదు. మంత్రి అందుకు తగ్గట్టు ప్రయత్నం చేశారా? లేక ఆమె ప్రయత్నాన్ని సిఎం చంద్రబాబు తోసిపుచ్చారా? అన్నది మంత్రికే ఎరుక. గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శితో గిరిజనసంఘం నాయకులు సమావేశమైనా స్పెషల్ డిఎస్‌సి నిర్వహణపై ఎటువంటి సానుకూలతా రాలేదు.

వాస్తవానికి కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. నోటిఫికేషన్‌లోని 16,347 పోస్టుల్లో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనులకు కేవలం 45 పోస్టులే దక్కనున్నాయి. కానీ, 2వేల పోస్టుల వరకు గిరిజనులకు ఉన్నాయని మంత్రిగారు చెబుతున్నారు. ఇది మోసపూరిత ప్రకటన అని ఆదివాసీ గిరిజనులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. మంత్రి చెప్పింది వాస్తవమైతే ఆ రెండువేల పోస్టులు ఎక్కడెక్కడ గిరిజనులకు రిజర్వుచేయబడ్డాయో స్పష్టంగా చెప్పాలంటూ గిరిజనుల చేస్తున్న డిమాండ్‌కు మంత్రి నుంచి స్పందన రావడం లేదు. ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నిర్వహిస్తామని చెప్పిన గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఆ మాటను నిలబెట్టుకోకపోవడంతో ఆదివాసీ యువత ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఉద్యోగాల విషయంలో తమకు జరుగుతున్న అన్యాయంపై రగిలి పోతున్నారు. ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాలను ఆదివాసీలకే కల్పించే జిఒ 3 రద్దుపై పాలకపార్టీల తీరుపైనా వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న ఆదివాసీ యువత ఈ రెండు జిల్లాల్లో భారీగా ఉంది. బిఇడి, డైట్, వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణ పొంది సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం వయసు సడలింపు ఇవ్వడంతో తాజా డిఎస్‌సికి మరింత పోటీ పెరిగింది. మన్యం, అల్లూరి జిల్లాల్లో 889 పోస్టులు ఉంటే గిరిజనులకు తాజా నోటిఫికేషన్‌లో కేవలం 45 పోస్టులే దక్కనున్నాయి. దీంతో, తమ ప్రాంతంలో తమకు దక్కాల్సిన ఉద్యోగాలు దక్కకుండా పోతుండడంతో గిరిజన యువతలో అసహనం పెరుగుతోంది.



ప్రత్యేక డిఎస్ సితోనే న్యాయం

ఏజెన్సీలో గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించి స్థానిక గిరిజన నిరుద్యోగ యువతతో ఆ పోస్టులను భర్తీ చేస్తేనే వారికి న్యాయం జరుగుతుంది. సాధారణంగా నిర్వహించే డిఎస్‌సి ద్వారా గిరిజన అభ్యర్థులకు ప్రయోజనం బహు స్వల్పం. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక డిఎస్‌సి ద్వారా 640 పోస్టులను భర్తీ చేస్తామని జిఒ 233 జారీ చేసింది. కానీ, అది అమలుకాలేదు. గిరిజన సంఘాలు, గిరిజన నిరుద్యోగులు ఆందోళనలు చేసి నా ఫలితం లేకపోయింది. 2015లో అప్పటి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రావెల కిశోరబాబు గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డిఎస్‌సి నిర్వహిస్తా మని ప్రకటించారు. మూడేళ్లపాటు నోటిఫికేషన్ వెలువ డలేదు. 2019 ఫిబ్రవరిలో 611 పోస్టుల భర్తీకి టిడిపి ప్రభుత్వం జిఒ 10ని జారీ చేసింది. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ వెలువడలేదు. ఆదివాసీ ప్రాంతంపై ప్రభుత్వాల ఉదాసీనతకు తోడు అధికారుల అలసత్వంతో ఆదివాసీ ప్రాంతంలో విద్య, సంక్షేమం, ఉద్యోగ నియామకాలు, ఉద్యోగోన్నతులు లొసుగులమయంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపనకు, మంత్రి సంధ్యారాణి గిరిజన జాతికి ఇచ్చే హామీ నిలబెట్టుకునేందుకు గిరిజన యువత చేస్తున్న పోరాటం బలపరీక్షగా మారిందని పబ్లిక్ టాక్.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

లేబర్ కోడ్ చట్టాలకు వ్యతిరేకంగా ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలోని చర్చి సెంటర్లో శనివారం జీపు జాతాను యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం.గోపాలం జెండా ఊపి ప్రారంభించారు. చర్చి సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, కార్మిక సంఘాల నాయకులు కె.సురేష్, వి.లక్ష్మి, పి.శంకరరావు, పి.లక్ష్మణరావు, ఎం.గోపాలం మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ చట్టాలను తీసుకురావడం అన్యాయమన్నారు. లేబర్ కోడ్ చట్టాలతో కార్మికుల హక్కులను నష్టపోతారు. లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీపు జాతాలో కార్మిక సంఘాల నాయకులు పిలుపు

బొబ్బిలి : జీపుజాతాను ప్రారంభిస్తున్న యుటిఎఫ్ నాయకులు విజయగౌరి

రామభద్రపురం: మాట్లాడుతున్న అంగన్‌వాడీ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి

రామభద్రపురం: లేబర్ కోడ్ చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శనివారం జీపుజాతాతో వచ్చి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్ చట్టాలను తీసుకురావడం అన్యాయమన్నారు. ఈ లేబర్ కోడ్ చట్టాలతో కార్మికుల హక్కులకు నష్టమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకుడు బలసా శ్రీనివాసరావు, అంగన్వాడీ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేగిడి: కార్మికుల లేబర్ కోడ్ రద్దు, కార్మిక సమస్యల పరిష్కారానికి ఈనెల 20న సమ్మెకు కార్మికులంతా సమాయత్తం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, అధ్యక్షులు పి శంకర్రావు అన్నారు. ఈ మేరకు శనివారం ఇఐడి ప్యారి ఇండియా లిమిటెడ్ యూనియన్ అధ్యక్షులు వై.శ్రీధర్ అధ్యక్షతన జీపు జాతకు స్వాగతం పలికారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను నేడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రద్దుచేసి దాని స్థానంలో కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభం చేకూర్చేందుకు 4 లేబర్ కోడ్స్ తెచ్చిందని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను బ్యాంకు ఇన్సూరెన్స్ రంగాలను ప్రైవేటీకరణ చేసి దేశానికి తీవ్ర నష్టం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం దుర్మార్గమైన విధానాలకు వ్యతిరేకంగా మే 20 సమ్మెలో ఉద్యోగ, కార్మిక వర్గాలు రైతు వ్యవసాయ కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు మాట్లాడుతూ దేశంలో షుగర్ ఫ్యాక్టరీలకు నష్టం కలిగించే విధానాల వల్ల రైతులు కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. షుగర్ తయారు చేయడం వల్ల ఉపయోగం లేక యాజమాన్యాలు తన లాభాల కోసం ఆల్కహాల్ తయారు చేసే దుర్మార్గానికి దిగుతున్నారని అన్నారు. కార్మికులు రైతులు ఐక్యమై షుగర్ ఫ్యాక్టరీలు రక్షించుకోవాలని అన్నారు. అందుకే మే 20 సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ విఆర్‌ఎస్ నాయుడు, మజ్జి వెంకటరమణ, ఆదినర్సు, సుధాకర్, దారి నాయుడు కార్మికులు పాల్గొన్నారు.

రేగిడి: కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

మనో విజ్ఞాన శాస్త్రం పుస్తకాలతో డిఎస్‌సి అభ్యర్థులు

డిఎస్‌సి అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - బొబ్బిలి

ఈ ఏడాది డిఎస్‌సి రాస్తున్న అభ్యర్థులకు యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎస్ఎస్ఎస్ డిగ్రీ కాలేజీలో శిక్షణతో పాటు ప్రముఖ విద్యావేత్త, మాజీ పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు రాసిన మనోవిజ్ఞాన శాస్త్రం పుస్తకాలను 200 మందికి ఉచితంగా పంపిణీ చేశారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సును రాష్ట్ర నాయకులు విజయగౌరి ప్రారంభిస్తూ, భావి ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు, అనేక కేంద్రాల్లో ఉచితంగా డిఎస్‌సి మెటీరియల్‌ను, పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. సమయం మేనేజ్మెంట్, ధైర్యం, విశ్వాసంతో అభ్యర్థులంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సిలబస్‌తో పాటు, మెళకువలు, రాసే విధానం అంశాలపై రిసోర్స్‌పర్సన్స్‌గా మండలం రమేష్, రామకృష్ణ, బి.శంకరరావులు వ్యవహరించారు. వాసు విద్యాసంస్థల అధినేత వాసుదేవరావు అభ్యర్థులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, పి.సత్యనారాయణ, రమేష్, పారినాయుడు, శ్రీనివాస్‌లతో పాటు అభ్యర్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పైడితల్లమ్మ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ ఆదివారం నుంచి మూడు రోజులు పాటు వైభవంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం తోలేళ్ళు, మంగళవారం అణుపు ఉత్సవం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళా కోలాటాలు, అమ్మవారి బండి ప్రభ, భారీ మందుగుండు సామాను కాల్పులు చేపడతామన్నారు.

పిహెచ్‌సికి ఇద్దరు వైద్యుల నియామకం

ప్రజాశక్తి - వేపాడ

డాక్టర్ ఎం.వేణు

డాక్టర్ సంజన

స్థానిక పిహెచ్‌సికి ఇద్దరు వైద్యాధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఇక్కడ వైద్యాధికారిగా ఉన్న ఏ.ధరణి ప్రమోషన్‌పై పోస్టు గ్రాడ్యుయేషన్‌కు వెళ్లడంతో ఆమె స్థానంలో డాక్టర్ ఎం.వేణు, డాక్టర్ సంజన బాధ్యతలు స్వీకరించారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి ఇద్దరు వైద్యాధికారులను నియమించినందుకు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యురాలితో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రామారావు

సిహెచ్‌సి నూతన భవనం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సిహెచ్‌సి నూతన భవనం త్వరితగతిన పూర్తి చేయాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన సిహెచ్‌సి నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించి వైద్యాధికారితో మాట్లాడారు. ఏళ్ల తరబడి సిహెచ్‌సి నూతన భవనం నిర్మాణం జరుగుతుందని ఎప్పటికి పూర్తవుతుందని అడిగారు. నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని కూటమి ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్యం వహించి నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్ల వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గదులు చాలక ఇరుకు గదుల్లో వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన భవనాన్ని నిర్మాణం పూర్తి చేసి మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె. పద్మనాభం పాల్గొన్నారు.



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రోటరీ ప్రతినిధులు

అమర వీరుడా వందనం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆపరేషన్ సిందూర్‌లో తెలుగు బిడ్డ దేశ రక్షణకు సేవాలందిస్తూ పాక్ జవానుల తూటాలకు బలై వీరమరణం పొందిన వీర జవాన్ మురళి నాయక్‌కు రోటరీ, కారుణ్య సంస్థ సభ్యులు ఘన నివాళులర్పించారు. శనివారం రోటరీ క్లబ్ అధ్యక్షులు సిందిరి శ్రీనివాసన్ ఆధ్వర్యంలో మురళి నాయక్‌కు నివాళులు అర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ అగ్నివీరుని చిత్ర పటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులను వెలిగించి నివాళులు అర్పించారు. కారుణ్య చైర్మన్ జెసి రాజు మాట్లాడుతూ 25 ఏళ్ల వయసులో మాతృభూమి కోసం ప్రాణాలర్పించి అమరుడైన అగ్నివీరుడు మురళి నాయక్ త్యాగం దేశం మరచిపోదన్నారు. ఫౌండేషన్ చైర్ గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ యుద్ధభూమిలో దేశం కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం అందరికి స్ఫూర్తి దాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో కె. రామకృష్ణ, కృష్ణ మోహన్, ప్రసాద్, ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కళాసీలకు అవగాహన కల్పిస్తున్న సిఐ చిన్నంనాయుడు

మద్యంతో ఆరోగ్యానికి నష్టం

ప్రజాశక్తి - బొబ్బిలి

మద్యంతో ఆరోగ్యానికి నష్టమని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు అన్నారు. స్థానిక మేదరబంద జంక్షన్‌లో శనివారం మద్యం వల్ల జరిగే అనర్థాలపై కళాసీ కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగడం వల్ల అనారోగ్యం బారిన పడడంతో పాటు ఆర్థికంగా నష్టం జరుగుతుందని, మద్యానికి దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ కల్లుకు దూరంగా ఉండాలి

కల్తీ కల్లుకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్ఐ రాముడు కోరారు. స్థానిక పాకివీధిలో శుక్రవారం రాత్రి కల్తీ కల్లు వల్ల కలిగే అనర్థాలపై పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. కల్తీ కల్లుతో ఆరోగ్యానికి ప్రమాదమని, కల్తీ కల్లు, నాటుసారాకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, కార్మికులు పాల్గొన్నారు.

అరాచక శక్తులను బిజెపి ప్రోత్సహిస్తోంది : టిడిపి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో అరాచక శక్తులను బిజెపి జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ ప్రోత్సాహించడం దారుణమని టిడిపి నాయకులు సువ్వాడ రవి శేఖర్, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు అన్నారు. శనివారం వారు స్థానిక టిడిపి కార్యాలయంలో ఇటీవల నగర పంచాయతీ బిజెపి నాయకులు అన్న క్యాంటీన్ పై చేసిన విమర్శలపై విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు మాట్లాడుతూ అన్న క్యాంటీన్ పై నగర పంచాయతీ బిజెపి నాయకులు రాజకీయ లబ్ది కోసం అవాకులు చవాకులు పేలారాని అవన్నీ అవాస్తవాలని తెలిపారు. క్యాంటీన్‌లో అవకతవకలు జరుగుతున్నాయని వైసిపి నుంచి బిజెపిలో చేరిన నగర పంచాయతీ అరాచక నాయకుడుకి బిజెపి జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ వత్తాసు పలికి ప్రోత్సహించడం పొత్తు ధర్మాన్ని విస్మరించడం కాదా అని ప్రశ్నించారు. దీనికి బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్ వర్మ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నగర పంచాయతీ బిజెపి నాయకుడు పబ్బం గడుపుకోవడానికి అన్న క్యాంటిన్‌పై లేనిపోని ఆరోపణలు చేశారని, బిజెపి నాయకుడిలా వ్యవహారించుకుండా వైసిపి నాయకుడిలా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కూటమిలో భాగస్వామ్యమైన బిజెపి ఇలాంటి నాయకులను ప్రోత్సాహించడం తగునా అని ప్రశ్నించారు. పొత్తు ధర్మాన్ని పాటించని నగర పంచాయతీ బిజెపి నాయకున్ని పార్టీ నుంచి సస్పెండ్ చేసి ప్రోత్సాహస్తున్న జిల్లా అధ్యక్షులు రాజేష్ వర్మ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే బిజెపి జాతీయ నాయకులు పురందేశ్వరికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు అవనాపు సత్యనారాయణ, కింతాడ కళావతి, బైరెడ్డి నాగేశ్వరరావు, రెడ్డి వేణు, కాళ్ల రాజశేఖర్, పంచాది కిరణ్, కలిశెట్టి కన్నంనాయుడు, ముడుమంచి లక్ష్మణరావు, మజ్జి ఆదినారాయణ, చందక శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు రవిశేఖర్, రాజారావు, అప్పలనాయుడు

తల్లుల పాదాలకు వందనం చేస్తున్న పిల్లలు

అంగన్‌వాడీల్లో 'తల్లికి వందనం'

ప్రజాశక్తి - వేపాడ

కిషోర బాలికల వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పిల్లలకు తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు వారి తల్లిదండ్రుల కాళ్లకు నమస్కరించారు. పిల్లల ఆరోగ్యం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు గురించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు కామేశ్వరి, భాగ్యలక్ష్మి అంగనవాడీ కార్యకర్తలు లత, కృష్ణ వేణి, ఈశ్వరమ్మ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బకాయి చెల్లించాలి

ప్రజాశక్తి- శృంగవరపు కోట

ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని ఆర్‌టిసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. శనివారం ఎస్‌కోట డిపో ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యాలయంలో డిపో అధ్యక్షులు కెజి నాయుడు అధ్యక్షతన, కార్యదర్శి కొల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఎపిపిటిడి (ఆర్‌టిసి) ఉద్యోగులకు రావల్సిన బకాయిలలో గత ప్రభుత్వం హయాం నుండి పెండింగు ఉన్న బకాయిలు 11వ పిఆర్‌సికి సంబందించి 24 నెలలు అరియర్స్, నాలుగు డిఎలు అందుకు సంబందించిన అరియర్స్ సరండర్ లీవులు, లీవ్ ఎన్ క్యాష్ డబ్బులలో వేల కోట్లు రూపాయలలో ఏ ఒక్క బకాయి కూడా చెల్లింపులు జరగడంలేదన్నారు. దీంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను దశల వారీగా చెల్లింపులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఉద్యోగులకు విలీనం అనంతరం 2020 తరువాత రిటైర్ అవుతున్న వారికి ప్రభుత్వం నుండి రావల్సిన బకాయిలలో లీవ్ ఎన్ క్యాష్ డబ్బులు గాని, పిఆర్‌సి, డిఎలకు సంబందించిన బకాయిలు గాని సెటిల్మెంట్ల చెల్లింపులు జరగడంలేదన్నారు. ఈ సమావేశంలో ఇయు డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.బానుమూర్తి, జిల్లా అధ్యక్షులు కె.కృష్ణారావు, కార్యదర్శి జి.రవికాంత్, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కెయస్‌యస్ మూర్తి, అన్ని డిపోల నాయకులు, ఇతర సంఘాల నాయకులు, కార్యకర్తలు ఉద్యోగులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు నాయుడు

ఎమ్మెల్సీకి పలువురు వినతులు

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని చెల్లాపురంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయాన్ని శనివారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు దంపతులు సందర్శించారు. అనంతరం గాదె శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ, ఆలయాన్ని సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్సీను ఆల్తి రాంబాబు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయలు ఇచ్చిన పలు వినతి పత్రాలను ఆయన అందుకొని, సర్వీస్ రూల్స్ సాధించటం, సిపిఎస్ రద్దుకు, ఎస్‌జిటిలకు బదిలీల్లో మాన్యూవల్ కౌన్సిలింగ్ జరిపించడానికి, ఎంటిఎస్‌లకు 12నెలలు జీతం, సర్వీస్ 62 సంవత్సరాలకు పెంపుదల, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల సమస్యల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం బైరిపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి, సీతారామ ఆలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఆల్తి రాంబాబు, చెల్లాపురం మాజీ సర్పంచ్ కర్రోతు నాగేశ్వరరావు, టిడిపి నాయకులు రెడ్డి శ్రీరాములు, ఆల్తి శ్రీహరి, ఆర్ సింహాద్రి, జెబి శ్రీనివాసరావు, బోర చంద్రరావు, సింగారపు రామకృష్ణ, పప్పల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు దంపతులు

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

బైక్‌ల దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని మొయిదకు చెందిన వారి 2 మోటార్ సైకిళ్ళని దొంగిలించిన కేసులో ఇద్దరు నిందితులని అరెస్టు చేసి వారి వద్ద నుండి 9 మోటార్ సైకిళ్ళను రికవరీ చేసి, వారిని రిమాండ్‌కు తరలించామని విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీనివాస రావు వెల్లడించారు. శనివారం ఆయన దొంగతనానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొయిద గ్రామానికి చెందిన తాళ్ళపూడి తాతారావు ఈ నెల 2న తన స్ప్లెండర్ ప్లస్ ప్లస్ మోటార్ సైకల్‌ని తన ఇంటి ముందు పార్క్ చేశారు. దీన్ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. అదే గ్రామానికి చెందిన పొట్టుపోగుల సంతోష్ ఈ నెల 3న తన టివిఎస్ ఎక్స్ఎల్ మోటార్ సైకల్‌ని జ్యూట్ మిల్ సమీపంలో పార్క్ చేయగా, దొంగిలించారు. దీంతో బాధితులు నెల్లిమర్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా శనివారం ఉదయం ఎస్ఐ బి.గణేశ్, వారి సిబ్బంది కలిసి చిన బూరాడపేట గ్రామ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వస్తూ, పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అనుమానంపై వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, వారి పేర్లు బెల్లాన చంద్రశేఖర్, దన్నాన సూరిబాబు అని చెప్పారు. వారిపై గతంలోనే రెండు కేసులు ఉన్నట్లు అంగీకరించారు. వాళ్ళు ఇద్దరూ కలిసి, నెల్లిమర్ల మండల పరిధిలో 2 బైక్‌లు, గజపతినగరం మండల పరిధిలో 1 బైక్, విజయవాడ సిటి పరిధిలో 4 బైక్‌లు, గుర్ల మండల పరిధిలో 1 బైక్, కశింకోట మండల పరిధిలో 1 బైక్, మొత్తం 9 బైక్‌లు దొంగిలించినట్లు అంగీకరించారు. వారి నుండి మొత్తం 9 బైక్‌లు రికవరీ చేసి, నిందితులను రిమాండుకు తరలించామని డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో భోగాపురం సిఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని మొయిద చంపావతి నదీ తీరంలోని తుప్పల్లో దొంగ చాటుగా గంజాయి కాలుస్తున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేశామని ఎస్ఐ బి.గణేష్ శనివారం తెలిపారు. వారి వద్ద నుంచి 100 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అందరూ చదువుకుంటున్న విద్యార్థులేనని చెప్పారు. గంజాయిని ఒరిస్సా రాష్ట్రంలోని రాయగడ ప్రాంతంలోనే రైల్వే స్టేషన్ దగ్గర ఒక గుర్తు తెలియని వ్యక్తి నుంచి కొనుక్కొని తెచ్చుకొని ఇక్కడ సేవిస్తున్నారన్నారు. స్నేహితుల వల్ల ఈ గంజాయికి అలవాటు పడినట్లు అంగీకరించారని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పిహెచ్‌సిలో మాక్ డ్రిల్

ప్రజాశక్తి- డెంకాడ

పోలీసులు, వైద్య సిబ్బంది సంయుక్తంగా కలిసి శనివారం మోపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. పాకిస్తాన్, భారత్ మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఏ క్షణంలో అయినా బాంబులు, పాకిస్తానీయులు కుట్ర పూరితంగా అవాంఛనీయ కార్యక్రమాలకు పాల్పిడినప్పుడు ప్రజలు గాయపడినప్పుడు ఏ విధంగా భాధితలను పోలీస్ సహాయంతో ఆసుపత్రికి తరలించాలనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది వెంటనే ఏ విధంగా చికిత్స అందించాలి వంటి వాటిని ప్రత్యక్షంగా చేసి చూపించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి శరణ్య, ఎంపిహెచ్‌యస్. సూరిబాబు, వైద్య పరంగా భాదితులకు వెంటనే ఏ విధంగా ఆసుపత్రికి తీసుకొని వచ్చి ఏ విధమైన వైద్యసేవలు పొంద వచ్చో అవగాహన కల్పించారు. తీర ప్రాంతానికి దగ్గరగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఒక వేళ ఫిరంగులు, బాంబులు లాంటివి వేసినప్పుడు ప్రజలు నేలపై కూర్చుండి పోవాలని, కూర్చొనే మనం నడిచి వెళ్లాలని డెంకాడ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రెడ్డి అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఎంఒ మజ్జి గణపతి, హెల్త్ సూపర్ వైజర్ యస్.సూరిబాబు, హెచ్‌సి రెడ్డి, హెచ్‌వి రెహ్మత్ ఉన్నిసా, ల్యాబ్ టెక్నీషియన్ పార్వతి, ఝాన్సీలక్ష్మి, ఎఎన్ఎం ఎం.జయలక్ష్మి, రమణమ్మ, ఆశా కార్యకర్త, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని చికిత్సకు తరలిస్తున్నట్టు సిబ్బంది

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక గొల్ల వీధిలో శ్రీకృష్ణ, విఘ్నేశ్వర, మహాలక్ష్మీ విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విన్నకోట భాస్కరశర్మ, అయ్యప్ప తదితర వేద పండితుల మంత్రోచ్ఛరణతో ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బొబ్బిలి గోవింద, అల్లసాని శ్రీను తదితర ఏడుగురు దంపతులు హోమం నిర్వహించారు. విగ్రహ దాత పిల్లా రామకృష్ణ దంపతులు, బొబ్బిలి అప్పారావు, బొబ్బిలి రామకృష్ణ విజయలక్ష్మి, రామ్మోహన్, శాంతి, రమేష్, డాక్టర్ శ్రీను దంపతులు, పిల్లల రమణ, న్యాయవాది యలమంచిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని కొండతామర పల్లి గ్రామానికి చెందిన కోరాడ దొరబాబు(21) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. పోలీసులు వివరాలు ప్రకారం.. గతంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో మనస్థాపం చెంది తన ఇంట్లో వుడ్ పాలిష్‌ను శరీరంపై వేసుకుని నిప్పు అంటించుకుని మృతి చెందాడు. మృతుని అక్క రోహిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని అక్క రోహిణికి ఈ మధ్యకాలంలో పెండ్లి సంబంధం కుదిరింది. ఇటువంటి సమయంలో దొరబాబు మృతి చెందడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దగ్గరుండి నారను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న ఎస్ఐ

దగ్ధమైన జ్యూట్ తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

డెంకాడ: గత వారంలో నాతవలస టోల్గేట్ వద్ద లారీ దగ్ధమై డ్రైవర్ సజీవ దహనం ఆయన సంగతి తెలిసిందే. అప్పట్లో లారీలో మంటలను అదుపు చేసినా రోజు రోజుకు నార లారీ కావడంతో మరలా అగ్గి రాజుకుంటూ మంటలు వస్తూ ఎక్కువగా పొగ రావడంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రజాశక్తిలో దగ్ధమైన జ్యూట్‌ను తొలగించరా అనే శీర్షికతో కథనం వెలువడింది. దీనికి స్పందించిన ఎస్ఐ సన్యాసి నాయుడు శనివారం టోల్గేట్ వద్ద మరల మంటలు వస్తున్న జ్యూటు లారీని ట్రాక్టర్ల సహాయంతో చంపావతి నది నుంచి నీరు తీసుకువచ్చి పొగ రాకుండా పూర్తిగా ఆర్పి వేశారు. జెసిపి సహాయంతో దగ్ధమైన లారీని రోడ్డుకు దూరంగా తొలగించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐను అభినందిస్తున్నారు.